పశువులకు వడదెబ్బ ముప్పే

- పాల దిగుబడిపై ప్రభావం
- మృత్యువాత పడే ప్రమాదం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

బత్తలపల్లి: నోరులేని పశువులు అనారోగ్యానికి గురైతే మనకి చెప్పలేవు. పశుపోషకులే వాటిని గుర్తించి ప్రథమ చికిత్స అందించాలి. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా పాడినే నమ్ముకుని జీవించే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వేసవిలో పశువులు వడదెబ్బకు గురయ్యే అవకాశం అధికంగా ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పశువులు వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవచ్చని బత్తలపల్లి మండల పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి సూచించారు.

శరీర ప్రక్రియ మందగిస్తుంది..

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతాయి. మూత్ర పిండాలు సరిగా పనిచేయక పోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. నీడ కోసం చెట్టు కింద చేరి కూలబడుతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. వడదెబ్బ వల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలకు అతిసార వ్యాధి వ్యాపిస్తుంది.



పశువులకు వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

నివారణ చర్యలు..

వేసవిలో ఎండలోకి పశువులను వదలకూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పశువులను బయటకు వదలాలి. పశువులను రోజుకు మూడు, నాలుగు సార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురువుతాయి. వాటిపై తరచుగా చల్లటి నీటిని చల్లుతుండాలి. గాలి బాగా ప్రసవించేటట్లు ఎత్తై పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకుల కప్పులు ఉన్న పశువుల షెడ్లపై గడ్డిని కప్పి మధ్యాహ్న వేళల్లో నీటిని చల్లుతుండాలి. వడగాల్పుల ప్రభావం పడకుండా గోనె సంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.



గుర్నాథరెడ్డి, పశువైద్యాధికారి

చికిత్స విధానం ఇలా..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలివీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు చల్లటి నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే సమీపంలోని పశువైద్యాధికారులను సంప్రదించాలి. వేడిని తగ్గించే ఇంజెక్షన్ వేయాలి. రక్తంలో డెక్స్ట్రోజ్ సైలెన్ ఎక్కించడం వల్ల శరీరానికి సరిపడా గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అంది పశువులు నీరసం నుంచి బయటపడుతాయి.

నియోజకవర్గంలో పశువుల వివరాలు ఇలా..

మండలం	ఎద్దులు/ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
ధర్మవరం	12,000	4,000	85,000	15,000
బత్తలపల్లి	7,500	2,300	85,000	11,000
తాడిమర్రి	7,000	2,500	80,000	9,000
ముదిగుబ్బ	14,000	4,000	1,35,000	15,000

క్లుప్తంగా

అధైర్యపడొద్దు అండగా ఉంటాం



రాఘవరెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: అధైర్యపడొద్దు అండగా ఉంటానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. వారం రోజుల క్రితం కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్టా రాఘవరెడ్డి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నదానానికి కదిరి పట్టణానికి చెందిన లక్ష్మీదేవమ్మ కుమారుడు శ్యాంప్రసాద్ రూ.41,116 విరాళంగా అందజేసినట్లు ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్ము భాస్కర్, బీజేపీ నాయకుడు వెంకటేష్, కాంగ్రెస్ నాయకుడు నచ్చు బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో చదును పనులు



ట్రాక్టర్‌తో పనులు చేయిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కేంద్రంలోని సత్యసాయి డిగ్రీ కళాశాల నూతన భవనం పక్కన ఉన్న ఆట స్థలాన్ని సర్పంచ్ నాగలక్ష్మి ఆదివారం శుభ్రం చేయించారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఆట స్థలం లేక ఇబ్బందులు పడకుండా మైదానంలో ముళ్ల పొదల్ని తొలగించారు. ట్రాక్టర్ డోజర్ పనులు వేగవంతం చేశామని, త్వరలో మైదానాన్ని వినియోగంలోకి తీసుకొస్తామని సర్పంచ్ నాగలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో పీడీ శివ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం




బత్తలపల్లి: విద్యార్థుల తల్లిదండ్రులతో కిక్కిరిసిన పరీక్ష కేంద్రం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్ష జరిగింది. 243 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 233 మంది హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. బత్తలపల్లి ఎస్‌ఐ టీపీ శ్రీహర్ష ఆదేశాలతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు సైతం రావడంతో పాఠశాల ఆవరణం కిక్కిరిసిపోయింది.

రామగిరి: మండలంలోని పేరూరుడ్యాంలోని మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో 5వ తరగతి పవేశపరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ ఓబులేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో మొత్తం 427 మంది విద్యార్థులకు గాను 405 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్



రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గోరంట్ల: ధర్మవరం నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం మండల పరిధిలోని కొండాపురం క్రాస్ వద్ద విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఐచర్‌లో తరలిస్తున్న 140 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి గోరంట్ల పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ధర్మవరానికి చెందిన సుబ్బరాయుడు, బాలు, ఎర్రకుంటకు చెందిన బోయ నరసింహులు, రాప్తాడుకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారి రామరావు తెలిపారు.

ఉత్సాహంగా వన భోజనాలు



గంపలు ఎత్తుకుని శ్రీరాముడి చిత్రపటంతో వస్తున్న గ్రామస్తులు

తాడిమర్రి: మండలంలోని మద్దులచెర్వు గ్రామంలో ఆదివారం గ్రామస్తులు వన భోజనాలకు వెళ్లారు. గ్రామంలో శ్రీరామనవమి పండుగ అనంతరం వన భోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం 6 గంటలకే ఇళ్లకు తాళాలు వేసి, వంట సరుకులు నింపుకున్న గంపలతో పిల్లలు, వృద్ధులతో సహా పశువులను తోలుకుని పొలాల వద్ద చెట్ల కిందకు చేరారు. అక్కడ పిండి వంటలు చేసుకుని ఆరగించారు. అనంతరం యువతులు ఉయ్యాలలు ఊగగా, యువకులు ఉత్సాహంగా రాళ్లు, టెంకాయ పందేలు ఆడారు. భజనలు చేస్తూ శ్రీరాముడి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం మామిడి తోరణం కింద గ్రామంలోకి చేరిన మహిళలు బొడ్రాయికి బిందెడు నీరు పోసి ఇళ్లకు చేరుకున్నారు.

చీరల పంపిణీ

నల్లమాడ: మండల పరిధిలోని మీసాలవాండ్లపల్లిలో ఆదివారం రంజాన్ పండుగను పురస్కరించుకుని 20 ముస్లిం కుటుంబాలకు చీరలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు లెక్చరర్ ఎం.జయరాం తెలిపారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇద్దేవాండ్లపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అమడగూరులోని చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అర్చన, అభిషేక పూజలు చేసి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రతి ఇంటికీ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కుల, మత, వర్గ, పార్టీలు అనే తేడా లేకుండా అర్హులందరికీ పథకాలను అందిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చాన హామీలన్నింటినీ నెరవేర్చామన్నారు. భవిష్యత్తులో మనమంతా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలన్నారు. కాగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవిత, కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, రాష్ట్ర బత్రాజుల సంఘం డైరెక్టర్ మధుసూధన్ రాజు, మాజీ కన్వీనర్ శేషూరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి, బొట్టు స్వామి, స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ నరసమ్మ, ఎంపీటీసీ కోగర జయమ్మ, నక్కల చిన్నప్ప, నాగరాజు, నరసింహులు, రాజన్న, గంగులప్ప, శ్రీనివాసరెడ్డి, లక్ష్మిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

రోడ్ల ప్రారంభం..

మండలంలో నూతనంగా నిర్మించిన తారు, సీసీ రోడ్లను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. రెడ్డివారిపల్లి, పత్రవాండ్లపల్లి, తనకంటివారిపల్లి గ్రామాలకు వేసిన రోడ్లను ప్రారంభించారు. కాగా ఎన్నో ఏళ్లుగా ఆయా గ్రామాలకు రోడ్లు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. అయితే రోడ్ల నిర్మాణాలు పూర్తి కావడంతో గ్రామస్తులంతా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలను తెలియజేశారు.

నేడు జేకేపల్లి పంచాయతీలో..

మండలంలోని జేకేపల్లి పంచాయతీలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు జౌకలకొత్తపల్లిలో ప్రారంభమయ్యే కార్యక్రమం హరిపురం, తనకంటిపల్లి, కందుకూరిపల్లి గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి



పుట్టపర్తిలోని అపార్టుమెంట్‌లో గ్యాస్ ప్రమాదంపై అవగాహన కలిగిస్తున్న ఫైర్ సిబ్బంది




ధర్మవరం రూరల్: ప్రమాదాలపై డెమో ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ధర్మవరం రూరల్: అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి యు.రాజు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మామిళ్లపల్లి సమీపంలోని నేషనల్ హైవేపై ఉన్న ఫుడ్‌ప్లాజా రెస్టారెంట్ (హైవే ఎనిమిటీస్) సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించారు. అనంతరం అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ.. ఈనెల 14 నుంచి 20 వరకూ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ముంబై ఓడలో జరిగిన అగ్ని ప్రమాదంలో 64 మంది అగ్నిమాపక సిబ్బందితో పాటు వందల సంఖ్యలో ప్రజలు మృతి చెందారన్నారు. దీంతో ప్రతి సంవత్సరం వారి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వరకూ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మార్గదర్శకులు శివరామిరెడ్డి, ముస్తఫా, హరినాథ్‌రెడ్డి, రథశోదకులు కృష్ణమూర్తి, అగ్నిమాపక భటులు ప్రకాష్‌నాయుడు, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా అగ్ని మాపక శాఖ అసిస్టెంట్ అధికారి నాగరాజు నాయక్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మూడో రోజు పుట్టపర్తి పట్టణంలో ముఖ్యమైన అపార్టుమెంట్లు, హోటళ్లు, రద్దీ ప్రదేశాలతో పాటు కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి వద్ద ప్రమాదాలపై మాక్ డ్రిల్ చేపట్టారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని అగ్ని మాపక ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా బయటపడాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ, గడ్డి వాములకు నిప్పు పూరిపాకలు కాలిపోవడం జరుగుతుందన్నారు. ఒక్కోసారి చిన్న ప్రమాదాలు పెద్దవై భారీ నష్టం జరుగుతుందన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తామన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు స్పందన



నల్లమాడ: మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ధర్మవరం: ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న పట్టణ సచివాలయాల కన్వీనర్ సాయికుమార్

ధర్మవరం: పట్టణంలోని అన్ని వార్డుల్లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. పట్టణంలోని 9, 12 వార్డుల్లో పట్టణ సచివాలయాల కన్వీనర్ మాసపల్లి సాయికుమార్ ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను సేకరించారు. జగనన్నకు అండగా ఉంటామని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిన్నె సురేష్, ఓంప్రకాష్, కురాకుల రాజు, యుగంధర్, వెంకటేష్, పోతలయ్య, కుమార్, అల్లాడి చంద్ర, పిట్ట రాజు, మధుసూదన్‌రెడ్డి, రమణ, శివ, భారతి, ఉమేష్, నాగార్జున, గృహసారథులు, పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండల పరిధిలో కేశాపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా సాగింది. సర్పంచ్ నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగుతూ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజల అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో డీలర్ బాషా, పురుషోత్తమ రెడ్డి, విశ్వనాథ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తవళంమర్రిలో..

నల్లచెరువు: మండల పరిధిలోని తవళంమర్రి పంచాయతీలోని బండ్రేపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదేశాలతో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సుధాకర్, వలంటీర్లు మంజునాథ రెడ్డి, మీన, బీరప్ప, గృహసారథులు వై.జ్యోతి, వై.మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లచెరువు: బండ్రేపల్లిలో పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దొన్నికోటలో..

నల్లమాడ: మండల పరిధిలోని దొన్నికోట గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గడప గపడకూ వెళ్లి నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు. 82960 82960 నెంబర్‌కు ఫోన్‌చేసి ప్రజలు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, నాయకులు బాలాజీనాయులు, కమలాకర్ నాయుడు, రామకృష్ణ, అంజి పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక



కదిరి డివిజన్ బంజారా సంక్షేమ సేవా సంఘం సభ్యులు వీరే..

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం కదిరి డివిజన్ బంజారా సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణానాయక్, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు నాయక్, రవీంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శిగా చలపతినాయక్, సహాయ కార్యదర్శులుగా రమణనాయక్, నాగేంద్ర నాయక్, కోశాధికారిగా గోవిందు నాయక్‌తో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాగే కదిరి మండల బంజారా సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆనంద్‌నాయక్, ఉపాధ్యక్షులుగా చంద్రమోహన్ నాయక్, భీముడు నాయక్, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌నాయక్, సహాయ కార్యదర్శులుగా జయరాం నాయక్, మునేంద్ర నాయక్, కోశాధికారిగా బాబూ నాయక్‌తో పాటు మరి కొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఇఫ్తార్ విందుకు ఆర్థికసాయం అందజేత

ఎన్‌పీకుంట/తనకల్లు: ఎన్‌పీకుంట, తనకల్లు మండలాల్లోని మసీదుల్లో ఒక రోజు ఇఫ్తార్ విందు నిర్వహణకు నల్లచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల్యం సుధాకర్ ఆదివారం ఆయా మసీదుల ముతవల్లీలు, ఇమామ్‌లకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మసీదులకు ఒక్క రోజు ఇఫ్తార్ విందుకు తన వంతు సాయాన్ని అందించినట్లు పాల్యం సుధాకర్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వరరెడ్డి, మాజీ మండల కన్వీనర్ బాబా ఫకృద్దీన్, కదిరి పట్టణ అధ్యక్షులు బాహువుద్దీన్, లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, ప్రభుత్వ ఖాజీ హజ్రత్ యూసుఫ్, జామియా మసీదు ముతవల్లీ అస్లాం ముస్లిం నాయకులు బీఎస్ నిజాం, బాబాఫకృద్దీన్, ముస్తఫా, తాహీర్, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: తన సొంత నిధులతో దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్ రెన్యూవల్ చేయించిన నల్లచెరువుకు చెందిన పాల్యం సుధాకర్‌ను ఆదివారం కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మైనుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ తదితరులు సన్మానించారు. త్వరలో నల్లచెరువులో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, వికలాంగుల భవనం, దళితవాడకు శ్మశాన వాటిక నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పాలెం సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాహద్దీన్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎన్‌పీకుంట: మసీదుల ముతవల్లీలకు నగదును అందిస్తున్న పాల్యం సుధాకర్

నేడు ఇఫ్తార్ విందు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని మసీదు ఆవరణలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కదిరి టౌన్: పట్టణంలోని షాదీమహల్‌లో ఆదివారం రాత్రి అభిజ్ఞా ఫౌండేషన్ అధినేత, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు పవన్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పోతలయ్య స్వామికి పూజలు


కనగానపల్లి: మండలంలోని దాదులూరులో వెలసిన పోతలయ్యస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆది, మంగళవారాల్లో చుట్టు గ్రామాలకు చెందిన స్వామి కాపులు, భక్తులు అలయానికి వచ్చి స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. ఆదివారం పలువురు భక్తులు పోతలయ్యస్వామికి బోనాలు సమర్పించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ దేవత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి దేవమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బీజేపీని ఓడించాలి



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

ఓడీ చెరువు: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం (బీజేపీ) పాలనకు చరమగీతం పాడుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అన్నారు. ఈనెల 14 నుంచి 30 వరకూ చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కాటమయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానంతో పాలన సాగిస్తోందన్నారు. ఈ పాలన నుంచి ప్రజలను విముక్తి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దన్న, నియోజకవర్గ కార్యదర్శి అంజి, మండల కార్యదర్శి చలపతి, మహిళా కార్యదర్శి రత్నాబాయి, స్థానిక సీపీఐ నాయకులు పాల్గొన్నారు.